నమస్తే తెలంగాణ
హైదరాబాద్
హైదరాబాద్- మేడ్చల్
I హైదరాబాద్, మంగళవారం 24 డిసెంబర్ 2024 HYDERABAD




పీవీ నర్సింహారావు వర్ధంతి సందర్భంగా నెక్లెస్‌రోడ్‌లోని పీవీ ఘాట్ వద్ద నివాళులర్పిస్తున్న మంత్రిపొన్నం ప్రభాకర్ గౌడ్, ఎమ్మెల్సీ వాణీదేవి తదితరులు



సంయుక్త కిసాన్ మోర్చా జాతీయ కమిటీ పిలుపు మేరకు ఆర్టీసీ ఎక్స్ రోడ్డులో మార్కెట్ పాలసీ పత్రాలను దహనం చేస్తున్న రైతు సంఘాల నాయకులు



ఆర్టీసీ బస్సు సర్వీస్‌ను ప్రారంభిస్తున్న కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే వివేకానంద్ తదితరులు

# మహానేత కేసీఆర్

**పేదలు ఆత్మగౌరవంతో బతకాలని డబుల్ బెడ్‌రూం ఇండ్లు**

**ఆర్టీసీ బస్సు సర్వీస్‌ను ప్రారంభించిన ఎమ్మెల్యే వివేకానంద్**

దుండిగల్, డిసెంబర్ 23: రాష్ట్రంలో పేద ప్రజలు ఆత్మగౌరవంతో బతికేలా డబుల్ బెడ్‌రూం ఇండ్లు నిర్మించి ఇచ్చిన ఘనత బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌కే దక్కుతుందని కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ అన్నారు. దుండిగల్ మున్సిపాలిటీ పరిధి డీ.పోచంపల్లిలోని డబుల్ బెడ్రూమ్ సముదాయం నుంచి సికింద్రాబాద్ వరకు నూతనంగా ఏర్పాటు చేసిన ఆర్టీసీ బస్సు సర్వీస్‌ను సోమవారం ఎమ్మెల్యే ప్రారంభించి మాట్లాడారు. పేదలు ఆత్మగౌరవంతో బతకాలనే ఉద్దేశంతో తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ విశాలమైన డబుల్ ఇండ్లు పేదలకు ఇచ్చారని తెలిపారు. కుత్బుల్లాపూర్ డబుల్ బెడ్‌రూం ఇండ్ల సముదాయాల వద్ద విద్యుత్, మంచినీటి సరఫరా, భూగర్భ డ్రైనేజీ, బస్సు సదుపాయం వంటి వసతులు కల్పించాలని అధికారులను ఆదేశించామని ఎమ్మెల్యే పేర్కొన్నారు. అనంతరం బస్తీవాసులతో కలిసి ఎమ్మెల్యే బస్సులో ప్రయాణించారు. ఈ కార్యక్రమంలో దుండిగల్ మున్సిపాలిటీ వైస్ చైర్మన్ పద్మారావు, కౌన్సిలర్లు శంభీపూర్ కృష్ణ, కృష్ణ యాదవ్, సాయి యాదవ్, ఆనంద్ కుమార్, బుచ్చిరెడ్డి,విష్ణువర్ధన్‌రెడ్డి, బౌరంపేట పీఏసీఎస్ చైర్మన్ బాల్‌రెడ్డి, గ్రంథాలయ మాజీ చైర్మన్ నాగరాజు యాదవ్, పీఏసీఎస్ డైరెక్టర్ జీతయ్య పాల్గొన్నారు.




రుణమాఫీ చేయాలని ఘట్‌కేసర్‌లో ర్యాలీ తీస్తున్న మాజీ ఎంపీపీ, రాష్ట్ర బీజేపీ కార్యవర్గ సభ్యుడు ఏనుగు సుదర్శన్ రెడ్డి తదితరులు


# ఒక్కరికీ రుణమాఫీ కాలే..

ఘట్‌కేసర్ రూరల్, డిసెంబర్ 23: ఘట్‌కేసర్ రైతు సేవా సహకార సంఘంలో ఉన్న 1200 మంది రైతులకు ఏ ఒక్కరికీ రుణమాఫీ కాలేదని మాజీ ఎంపీపీ, రాష్ట్ర బీజేపీ కార్యవర్గ సభ్యుడు ఏనుగు సుదర్శన్ రెడ్డి అన్నారు. నియోజకవర్గంలోని ప్రతి రైతుకు రుణమాఫీ చేయాలని, లేకుంటే తీవ్రస్థాయిలో ఆందోళనకు దిగుతామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. మేడ్చల్ నియోజకవర్గంలో 80 శాతం రైతులకు రుణమాఫీ జరుగలేదని, వెంటనే రుణమాఫీ జేయాలని డిమాండ్ చేస్తూ ఘట్‌కేసర్ నుంచి మేడ్చల్ కలెక్టర్ కార్యాలయం వరకు ర్యాలీ చేపట్టారు. అనంతరం జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్ రెడ్డికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా మాజీ ఎంపీపీ ఏనుగు సుదర్శన్ రెడ్డి మాట్లాడుతూ.. అధికారదాహంతో 420 అబద్ధాలు చెప్పి.. ఓట్లు వేయించుకున్నారని, అధికారం వచ్చాక ప్రజలను మోసగించి హామీలను విస్మరించారని అన్నారు. హామీలు నెరవేర్చని కాంగ్రెస్ ప్రభుత్వానికి పాలించే హక్కు లేదని విమర్శించారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం డైరెక్టర్ జిల్లాల పోచిరెడ్డి, రైతు సంఘం నాయకులు మహిపాల్ రెడ్డి, బాలరాజు యాదవ్, నర్సింహులు యాదవ్, మధుసూదన్‌రెడ్డి, వెంకట్ రెడ్డి, పద్మారెడ్డి, మల్లేశ్, బాలరాజు తదితరులు పాల్గొన్నారు.

# ఆదాయం నిల్..అప్పులు ఫుల్

**ఆస్తి పన్ను, ట్రేడ్ లైసెన్స్‌ల వసూళ్ల పెంపుపై మారని అధికారుల వైఖరి**

**రూ.8440 కోట్ల బడ్జెట్‌కు స్టాండింగ్ కమిటీ ఆమోదం**




సిటీబ్యూరో, డిసెంబర్ 23 (నమస్తే తెలంగాణ): 2025-26 ఆర్థిక సంవత్సరానికి జీహెచ్ఎంసీ రూ.8,440 కోట్లతో ప్రవేశపెట్టిన బడ్జెట్ అంచనా ప్రతిపాదనలను సోమవారం జరిగిన ప్రత్యేక బడ్జెట్ సమావేశంలో స్టాండింగ్ కమిటీ ఆమోదించింది. మేయర్ విజయలక్ష్మి అధ్యక్షతన జరిగిన ప్రత్యేక బడ్జెట్ సమావేశానికి జీహెచ్ఎంసీ కమిషనర్ ఇలంబర్తి, స్టాండింగ్ కమిటీ సభ్యులు, అధికారులు పాల్గొన్నారు. కాగా గత స్టాండింగ్ కమిటీ సమావేశంలో అభ్యంతరాలు వ్యక్తం చేయడం, బడ్జెట్ పారదర్శకంగా ఉండాలని సభ్యుల సూచనల మేరకు మార్పులు చేశారు. రూ. 8340 కోట్లతో రూపొందించిన బడ్జెట్‌ను.. సభ్యుల సూచనల మేరకు రూ. 100కోట్ల మేరకు పెంచి రూ.8440కోట్లు సవరణ బడ్జెట్‌గా ఆమోదించారు. పెంపులో భాగంగా 2024-25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి టౌన్‌ప్లానింగ్ ఆదాయం రూ. 1,595.62కోట్లు అంచనా వేయగా, సవరణ బడ్జెట్‌లో దానిని రూ.938.96 కోట్లకు తగ్గించారు. మొదటి ఆరు నెలల్లో వచ్చిన ఆదాయం రూ. 425కోట్లు మాత్రమే. దీనిని బట్టి ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో రూ. 900కోట్ల ఆదాయం సమకూరడం కష్టసాధ్యంగా మారింది. ఈ పరిస్థితుల్లో ఏకంగా రూ. 1,201 కోట్ల ఆదాయం వస్తుందని రెవెన్యూ విభాగం అంచనా వేయడం గమనార్హం. ట్రేడ్ లైసెన్స్ ఆదాయం రూ. 92 కోట్ల నుంచి రూ.112 కోట్లకు పెంచి చూపించారు. కాగా వచ్చే ఏడాదిలో రూ.700 కోట్ల అప్పులు తీసుకురావాలని బడ్జెట్‌లో చూపించడం విశేషం. అయితే బడ్జెట్‌లో అభివృద్ధి పనులపై సభ్యులు అసంతృప్తి వ్యక్తం చేయడం, ఎన్నికల ఏడాది బడ్జెట్‌పై సభ్యులు పెదవి విరిచినా మేయర్ మాత్రం ఆమోదించేందుకు మొగ్గు చూపడం పట్ల పలు విమర్శలు వినిపిస్తున్నాయి.

### నిర్ణీత సమయంలో ఆమోదం పొందేనా?

వచ్చే ఏడాది జనవరి 10వ తేదీలోపు జనరల్ బాడి మీటింగ్‌లో సభ్యుల ముందు బడ్జెట్‌పై చర్చ పెట్టి ఆమోద ముద్ర పొందాల్సి ఉంటుంది. మార్పులు, చేర్పుల అనంతరం ఫిబ్రవరి 20లోపు అంచనాలను మంజూరు చేయాల్సి ఉంటుందని చట్టం చెబుతున్నది. మార్చి 1లోపు కార్పొరేషన్ బడ్జెట్ అంచనాల సమాచారాన్ని ప్రభుత్వానికి తెలియజేయాల్సి ఉంటుంది. కానీ క్షేత్రస్థాయిలో పరిస్థితులు విరుద్ధంగా కనబడుతుండటం గమనార్హం.

### కేటాయింపులు ఇలా..

హెచ్ సిటీ ప్రాజెక్టులకు రూ.1237 కోట్లు, రహదారులకు రూ. 650 కోట్లు, సమగ్ర రోడ్డు నిర్వహణకు రూ.185కోట్లు, నాలాలు, డ్రైయిన్లు రూ.200కోట్లు పార్కులు, పచ్చదనంకు రూ. 208 కోట్లు, చెరువులు, వారసత్వ కట్టడాల పరిరక్షణకు రూ. 173 కోట్లు, అప్పులు రూ.1933కోట్లు, ఇంకుడు గుంతలకు రూ.72కోట్లు, ఇంజినీరింగ్ నిర్వహణ పనులకు రూ.314,హెల్త్ శానిటేషన్ విభాగానికి రూ.600కోట్లు కేటాయించారు. కాగా హౌజింగ్‌కు రూ.300కోట్లు కేటాయింపులు జరిపారు.

☞ రెవెన్యూ వ్యయంలో రూ. 64 కోట్లు, క్యాపిటల్ వ్యయంలో రూ.36 కోట్లు పెంచి సవరణ బడ్జెట్‌ను రూ.100కోట్లు పెంచారు. సవరణలో భాగంగా ఆస్తిపన్ను, టౌన్‌ప్లానింగ్, ట్రేడ్ లైసెన్స్, ప్రకటనలు ఫీజుల ద్వారా దాదాపు రూ.228 కోట్లు ఆదాయం అదనంగా చూపారు. కేంద్ర ప్రభుత్వ గ్రాంట్లను రూ.419 కోట్ల నుంచి రూ.279 కోట్లకు తగ్గించారు. కూడికలు, తీసివేతలతో మొత్తంగా రూ.100కోట్లు పెంచారు.



ఎన్టీఆర్ స్టేడియంలో కొనసాగుతున్న హైదరాబాద్ బుక్ ఫెయిర్‌లో తమకు కావాల్సిన పుస్తకాలను కొనుగోలు చేస్తున్న పుస్తక ప్రియులు



ఎన్‌బీటీనగర్‌లో జేసీబీ సహాయంతో ఫుట్‌పాత్ ఆక్రమణలను కూల్చివేస్తున్న అధికారులు

బీఆర్ఎస్ పనులు..కాంగ్రెస్ గొప్పలు

# బీఆర్ఎస్ పనులకు.. కాంగ్రెస్ ప్రారంభోత్సవాలు

- మిషన్ భగీరథ పథకం ద్వారా ఇంటింటికీ మంచి నీళ్లిచ్చిన ఘనత కేసీఆర్‌దే..
- శివారు మున్సిపాలిటీలు, కార్పొరేషన్లకు నీళ్లివ్వడానికి గతంలో రూ.1200 కోట్లు మంజూరు
- మహేశ్వరం నియోజకవర్గానికి రూ.280 కోట్లు కేటాయింపు
- పైపులైన్లు, రిజర్వాయర్ల నిర్మాణానికి గత ప్రభుత్వం కృషి
- ప్రతి రోజు మంచి నీటి సరఫరా చేయాలని తలపించిన గత ప్రభుత్వం
- బీఆర్ఎస్ ప్రభుత్వం నిర్మించిన రిజర్వాయర్లకు కాంగ్రెస్ ప్రభుత్వం శిలాఫలకం, ప్రారంభోత్సవం
- మీర్‌పేట్, బడంగ్‌పేటలో రిజర్వాయర్లను పరిశీలించిన ఎమ్మెల్యే పి.సబితా ఇంద్రారెడ్డి





మీర్‌పేట్ నందిహిల్స్, బడంగ్‌పేట విశాఖ నగర్‌లో మిషన్ భగీరథ రిజర్వాయర్లను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే పి.సబితా ఇంద్రారెడ్డి తదితరులు

బడంగ్‌పేట, డిసెంబర్ 23: మిషన్ భగీరథ పథకం ద్వారా ప్రతి ఇంటికి మంచి నీళ్లు ఇచ్చిన ఘనత తెలంగాణ రాష్ట్ర తొలి ముఖ్యమంత్రి కేసీఆర్‌దేనని ఎమ్మెల్యే పి.సబితా ఇంద్రారెడ్డి అన్నారు. మీర్‌పేట్, బడంగ్‌పేట మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో గత ప్రభుత్వం నిర్మించిన రిజర్వాయర్లను అధికారులతో కలిసి ఆమె సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సబితారెడ్డి మాట్లాడుతూ.. ఇంటింటికీ నల్లా నీళ్లు ఇవ్వకపోతే ఓట్లు అడగనని కేసీఆర్ చాలెంజ్ చేసిన విషయాన్ని ఆమె గుర్తు చేశారు. ఇచ్చిన మాట ప్రకారం, నీళ్లు ఇచ్చామన్నారు. గ్రామాల్లో ప్రతి రోజు మిషన్ భగీరథ పథకం ద్వారా మంచి నీళ్లు ఏ విధంగా ఇస్తున్నామో.. నగర శివారు ప్రాంతాల్లో ఉన్న ప్రజలకు కూడా మంచి నీళ్లు అందించాలని కేసీఆర్ అప్పట్లోనే నిర్ణయం తీసుకున్నారని గుర్తు చేశారు. హైదరాబాద్ శివారు ప్రాంతాల్లో ఉన్న మున్సిపాలిటీలకు, మున్సిపల్ కార్పొరేషన్లకు మంచి నీటి సమస్య పరిష్కారం కావాలంటే మిషన్ భగీరథ పథకం ద్వారా ఇవ్వాలని ప్లాన్ చేశారని తెలిపారు. పైపులైన్లు వేయడానికి, రిజర్వాయర్లు నిర్మించడానికి గత ప్రభుత్వం హయాంలోనే రూ.1200 కోట్లు కేటాయించామన్నారు. మూడు దశలలో పనులు పూర్తి చేయాలని సంబంధిత అధికారులకు గతంలోనే ఆదేశాలు జారీ చేశారని, ప్రణాళికా బద్ధంగా పనులు చేయించారని పేర్కొన్నారు. మహేశ్వరం నియోజకవర్గంలో ఉన్న మంచి నీటి సమస్యను పరిష్కరించడానికి రూ.280 కోట్లు మంజూరు చేశారని పేర్కొన్నారు. మంజూరైన నిధులతో పైపులైన్ పనులు దాదాపుగా పూర్తి అయ్యాయని, రిజర్వాయర్ల పనులు చివరి దశకు వచ్చాయన్నారు. కొన్ని చోట్ల పనులు పూర్తి చేశామని చెప్పారు. పాత కాలనీల్లో తప్ప, మిగతా అన్ని కాలనీల్లో పైపులైన్లు వేశామని అన్నారు. రిజర్వాయర్ల పనులు పూర్తి అయ్యి ప్రారంభానికి సిద్ధంగా ఉన్నాయన్నారు. ఈ సందర్భంలోనే ఎన్నికలు రావడంతో గత ప్రభుత్వం వాటిని ప్రారంభించ లేకపోయిందని వివరించారు. కాంగ్రెస్ ప్రభుత్వం తాము చేసినట్లు గొప్పలు చెప్పుకుంటూ డంబాచారంగా ప్రారంభోత్సవాలు చేసుకున్నారని ఆమె ఆరోపించారు. రిజర్వాయర్ల నిర్మాణంలో కాంగ్రెస్ పార్టీ పైసా ఖర్చు చేయలేదన్నారు.

### నీటి నిల్వకు రిజర్వాయర్ల నిర్మాణం

నీటిని నిల్వ చేయడానికి వీలుండే విధంగా రిజర్వాయర్లను నిర్మించామని ఎమ్మెల్యే సబితాఇంద్రారెడ్డి అన్నారు. 50 ఏండ్ల వరకు నీటి సమస్య ఉత్పన్నం కాకుండా ఉండటానికి గత ప్రభుత్వం ప్రణాళికలు చేసిందని తెలిపారు. మహేశ్వరం నియోజక వర్గ వ్యాప్తంగా 19 రిజర్వాయర్లు నిర్మించినట్టు పేర్కొన్నారు. 29 ఎంఎల్‌డీ వాటర్ స్టోరేజీ చేసుకోవడానికి అవకాశం ఉంటుందన్నారు. బడంగ్‌పేట, మీర్‌పేట మున్సిపల్ కార్పొరేషన్లతో పాటు తుక్కుగూడ, జల్‌పల్లి మున్సిపాలిటీలలో రిజర్వాయర్లను నిర్మించినట్టు తెలిపారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో నీటి సమస్యే రాలేదన్నారు. రిజర్వాయర్లు నిర్మించడానికి గతంలో అనేక సమస్యలు ఎదుర్కొన్నామని చెప్పారు. ప్రజా ప్రతినిధులు, కాలనీ వాసుల సహకారంతో రిజర్వాయర్లు నిర్మించామని అన్నారు. ఈ కార్యక్రమంలో మేయర్ దుర్గా దీప్‌లాల్ చౌహన్, డిప్యూటీ మేయర్ తీగల విక్రంరెడ్డి, కమిషనర్ జ్ఞానేశ్వర్, డీఈ వెంకన్న, డీఈ జ్యోతి, వినల్ గౌడ్, కార్పొరేటర్లు ఏనుగు రాంరెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, బీఆర్ఎస్ పార్టీ నాయకులు రామిడి రాంరెడ్డి, అర్కల కామేశ్ రెడ్డి, మర్రి నర్సిరెడ్డి, ఆనంద్ రెడ్డి, కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు.

### కాంగ్రెస్ ప్రభుత్వం పైసా ఖర్చు చేయలే..

"రిజర్వాయర్లను నిర్మించడానికి కాంగ్రెస్ ప్రభుత్వం పైసా ఖర్చు చేయలేదు. ప్రారంభించడానికి మాత్రం శిలా ఫలకాలు, బోర్డులు మాత్రం ఏర్పాటు చేశారు. కేసీఆర్ ఎంతో ప్రతిష్టాత్మకంగా తీసుకొచ్చిన మిషన్ భగీరథ పథకం గురించి తప్పుగా మాట్లాడే వారు రిజర్వాయర్లను మాత్రం ప్రారంభించడం విడ్డూరం. రిజర్వాయర్లు ప్రారంభించడమే కాదు, ప్రతి రోజు నీళ్లు కూడా ఇవ్వాలి. పైపులైన్లు వేయని పాత కాలనీలలో కొత్త పైపులైన్లు వేయించాలి.

– ఎమ్మెల్యే పి.సబితా ఇంద్రారెడ్డి

# కూల్చేశారు..

**ఎన్‌బీటీ నగర్‌లో ఫుట్‌పాత్ ఆక్రమణల తొలగింపు**

**ఆపరేషన్ రోప్‌లో భాగంగా ప్రధాన రహదారిపై వెలసిన డబ్బాలను తొలగించిన పోలీసులు**

**మరోసారి పెడితే భవనాలు సీజ్ చేస్తామని హెచ్చరిక**

బంజారాహిల్స్,డిసెంబర్ 23: ఆపరేషన్ రోప్‌లో భాగంగా బంజారాహిల్స్ రోడ్ నం.12లోని ఎన్‌బీటీనగర్‌లో సోమవారం పుట్‌పాత్ ఆక్రమణలను అధికారులు కూల్చివేశారు. వెస్ట్‌జోన్ ట్రాఫిక్ డీసీపీ రాహుల్ హెగ్డే, ఏసీపీ కట్టా హరిప్రసాద్ ఆధ్వర్యంలో జీహెచ్ఎంసీ, ట్రాఫిక్ విభాగాల సిబ్బంది పెద్ద సంఖ్యలో వచ్చి ఎన్‌బీటీనగర్‌లోని ఆంజనేయస్వామి ఆలయం నుంచి బస్తీలో మొత్తం ప్రధాన రహదారిపై ఆక్రమణలను తొలగించారు. కిరాణ షాపులు, హోటళ్లు, ఇతర వ్యాపార సంస్థల ముందు ఉన్న రోడ్డును మొత్తం ఆక్రమించగా వాటిని కూల్చేశారు.

షట్టర్లు ఉన్న వారు లోపల వ్యాపారం పెట్టుకోకుండా రోడ్లమీదకు రావడంతో రోడ్డుపై కనీసం ఆటోలు కూడా వెళ్లేందుకు వీల్లేకుండా మారిందని స్థానికులు ఫిర్యాదులు చేయడంతో ఆపరేషన్ రోప్ చేపట్టామని ట్రాఫిక్ డీసీపీ రాహుల్ హెగ్డే తెలిపారు. ఆక్రమణలకు పాల్పడిన వారికి చెందిన సామాన్లను స్వాధీనం చేసుకోవడంతో పాటు కేసులు నమోదు చేస్తామన్నారు. మరోసారి రోడ్డుమీదకు వచ్చి వ్యాపారాలు కొనసాగిస్తే భవనాలను సీజ్ చేయించాల్సి ఉంటుందని హెచ్చరించారు. ఇక్కడ ఉన్న ఆక్రమణల కారణంగా బస్తీలోకి ఆర్టీసీ బస్సులు రావడం లేదని, దీంతో మహిళలు సుమారు కిలోమీటర్ దూరం నడవాల్సి వస్తోందని ఏసీపీ హరిప్రసాద్ తెలిపారు. ప్రతిరోజూ ఆక్రమణలపై నిఘా ఉంటుందని, ఎవరినీ ఉపేక్షించేదిలేదని పేర్కొన్నారు.



ఎన్‌బీటీనగర్‌లో ఆపరేషన్ రోప్‌లో భాగంగా ఆక్రమణల తొలగింపును పర్యవేక్షిస్తున్న ట్రాఫిక్ డీసీపీ రాహుల్ హెగ్డే